సాక్షి కామారెడ్డి

బుధవారం, 29, నవంబర్, 2023



ఐటీ దాడులు

జిల్లాకేంద్రంలోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కార్యాలయంపై మంగళవారం ఐటీ అధికారులు దాడులు చేశారు.

- 3లో ▶



ప్రచారంపై నిషేధం

ఎన్నికల నియమావళి ప్రకారం మంగళవారం సాయంత్రంనుంచి ప్రచారంపై నిషేధం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

- 2లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /19.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ర్యాండమైజేషన్



కామారెడ్డి క్రైం: పోలింగ్ బృందాలు, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించిన మూడో విడత ర్యాండమైజేషన్‌ను పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు చిఫంగ్ ఆర్థర్ వర్ఫూయో, జగదీశ్‌ల సమక్షంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్‌లో మంగళవారం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ పూర్తి చేసి విధుల కేటాయింపు జాబితాలను ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అందజేశామన్నారు. సంబంధిత డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో బుధవారం పోలింగ్ సిబ్బందికి ఉత్తర్వులు, మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ మెటీరియల్ అందజేస్తారని తెలిపారు. పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్ట్ ప్రకారం మెటీరియల్, ఈవీఎంలను సరిచూసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు రాజారాం, రఘునందన్, ఎన్ఐసీ ఫీల్డ్ ఇంజినీర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది కోసం బస్సులు

కామారెడ్డి క్రైం: జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వెళ్లడానికి బస్సులను అందుబాటులో ఉంచామని కలెక్టర్ పాటిల్ తెలిపారు. జుక్కల్ నియోజకవర్గానికి ఏర్పాటు చేసిన 18 బస్సులు బుధవారం ఉదయం 6.30 గంటలకు, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఏర్పాటు చేసిన 21 బస్సులు ఉదయం 7 గంటలకు స్థానిక కర్షక్ బీఈడీ కళాశాల మైదానం నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు. గురువారం పోలింగ్ అనంతరం తిరిగివచ్చేందుకు రాత్రి 9 గంటల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



కామారెడ్డి రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



కామారెడ్డిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి

ఆఖ్రీ దక్కా

- చివరి రోజు హోరెత్తిన ప్రచారం
- జిల్లా కేంద్రంలో కేటీఆర్, రేవంత్‌రెడ్డిల రోడ్‌షోలు
- బీజేపీ అభ్యర్థి కేవీఆర్ భారీ బైక్‌ర్యాలీ
- బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలోనూ ర్యాలీలు

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల ప్రచార ఘట్టం మంగళవారం సాయంత్రంలో ముగిసింది. ఆఖ్రీ దక్కా గట్టిగా ఉండాలన్న ఉద్దేశంతో అన్ని పార్టీలు హంగామా చేశాయి. ప్రధానంగా బిగ్‌ఫైట్ నడుస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో మూడు పార్టీలూ భారీగా జనాన్ని సమీకరించి రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించాయి. మిగతా నియోజకవర్గాల్లోనూ ప్రచారం జోరుగా సాగింది.

కామారెడ్డిలో..

సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్న కామారెడ్డి నియోజకవర్గంలో చివరి రోజు పోటాపోటీగా ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ తరఫున ఆయన తనయుడు కేటీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావ్, ముజీబొద్దీన్, తిర్మల్‌రెడ్డి తదితరులు పట్టణంలోని సిరిసిల్ల రోడ్డు నుంచి గంజ్‌రోడ్డు, అంగడిబజార్, పాంచ్‌రస్తా, వేణుగోపాలస్వామి రోడ్డు, బడామజీద్ మీదుగా ఇస్లాంపుర చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడారు. అనంతరం భవానీరోడ్డు, ఫారెస్ట్ ఆఫీసు, అంబేడ్కర్ విగ్రహం, పోలీసు స్టేషన్ మీదుగా ర్యాలీ సాగింది. అక్కడినుంచి కేటీఆర్ సిరిసిల్లకు బయలుదేరి వెళ్లారు.

కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పట్టణంలోని అంగడి బజార్‌నుంచి రోడ్‌షో ప్రారంభించి జేపీఎన్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు, పోలీసు స్టేషన్, రైల్వే కమాన్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యూసుఫ్‌అలీ, నాయకులు కైలాస్ శ్రీనివాస్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి దోమకొండ, బీబీపేటలలో నిర్వహించిన రోడ్డు షోలలో పాల్గొన్నారు.



కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి

బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. దేవునిపల్లి శివాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ విద్యానగర్, జన్మభూమి రోడ్డు, ఆర్‌కే లాడ్జీ రోడ్డు, కొత్తబస్టాండ్, నిజాంసాగర్‌చౌరస్తా, భవానీ రోడ్డు, గల్స్ హైస్కూల్‌రోడ్డు, పాంచ్ చౌరస్తా మీదుగా అంగడి బజార్ వరకు సాగింది. అక్కడ నిర్వహించిన సభలో వెంకటరమణారెడ్డి మాట్లాడారు.

ఎల్లారెడ్డిలో..

తాడ్వాయి, రామారెడ్డి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్ రోడ్‌షోలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల, వెల్లుట్లపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. లింగంపేట మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌షో సాగింది.

జుక్కల్‌లో..

పిట్లం మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే రోడ్‌షో నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంత్‌రావ్‌తో పాటు ఆ పార్టీ జాతీయ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రతాప్ గర్హి బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండల కేంద్రాల్లో బీజేపీ కార్యకర్తలు బైక్‌ర్యాలీలు తీసి, పార్టీ అభ్యర్థి అరుణతారను గెలిపించాలని కోరారు.

బాన్సువాడలో..

బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భారీ ర్యాలీ నిర్వహించారు. పోచారం ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా, గాంధీ చౌక్, కోటగల్లి, పాత అంగడి బజార్, తాడ్కోల్ చౌరస్తాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన స్థానికుడైన తనను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి బాన్సువాడ పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి వ్యాపారుల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన సభలో రవీందర్‌రెడ్డితో పాటు కాసుల బాల్‌రాజు మాట్లాడారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావ్ బీఆర్ఎస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కొయ్యగుట్ట వద్ద మైనారిటీలతో ఏనుగు రవీందర్ రెడ్డి సమావేశమయ్యారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ్ బీర్కూర్‌లో ప్రచారం నిర్వహించారు. బాన్సువాడతో పాటు వివిధ మండలాల్లో బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీలు తీశారు.

రేవంత్‌రెడ్డి సోదరుడి నివాసం వద్ద హైడ్రామా



కొండల్‌రెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి ఉంటున్న ఇంటి వద్ద మంగళవారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేవునిపల్లిలో కొండల్‌రెడ్డి నివాసం ఉంటున్న ఇంటికి రాత్రి 8 గంటల ప్రాంతంలో దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది చేరుకున్నారు. కొండల్‌రెడ్డి స్థానికేతరుడు కాబట్టి కామారెడ్డిలో ఉండరాదని, వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచించారు. విషయం తెలియడంతో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. తాను ఓ ఇండిపెండెంట్ అభ్యర్థికి ఏజెంట్‌గా ఉన్నానంటూ పత్రాలను చూపించారు. దీంతో పోలీసులు ఉన్నతాధికారులతో మాట్లాడారు. కొండల్‌రెడ్డి నివాసం వద్ద పోలీసు బలగాలతో బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ తాను అన్ని రకాల అనుమతులు తీసుకుని కామారెడ్డిలో ఉన్నానన్నారు. ఎంతోమంది బయట ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కామారెడ్డిలో మకాం వేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముందు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

భారీ వర్షం

మద్నూర్: జిల్లాలోని పలు ప్రాంతాలలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మద్నూర్‌లో వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో శనగ, కంది పంటలకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

బీజేపీతోనే.. బీసీలకు రాజ్యాధికారం



సుభాష్‌నగర్: బీసీలకు రాజ్యాధికారం కేవలం బీజేపీతోనే సాధ్యమని, మోదీ ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ మంగళవారం తెలిపారు. ప్రధాని మోదీ మంత్రివర్గంలో 27 మంది బీసీలు కేంద్రమంత్రులు ఉన్నారని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 40 మంది బీసీలకు టికెట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీసీలపై చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బీసీలు కాంగ్రెస్‌కు ఓటేస్తే ఒక వర్గం వారే ఆధిపత్యం చెలాయిస్తారని, బీసీల ఓట్లతో బీఆర్‌ఎస్ దొరల ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. బీసీలు బీజేపీకి ఓటేస్తే బీసీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు.

పోలింగ్ శాతం పెంచేలా..



మోర్తాడ్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. పోలింగ్ గురువారం ఉండడంతో ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగు చర్యలు చేపట్టింది. వీటి కోసం ఉద్యోగులకు ఎన్నికల కమిషన్ దిశానిర్దేశం చేసింది. గతంలో 70 శాతం నుంచి 75 శాతం పోలింగ్ జరుగగా ఈసారి 90 శాతం పోలింగ్ జరిగేలా ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేశారు. స్లిప్పులను పంపిణీ చేసే సమయంలోనే ఓటు హక్కు ప్రాధాన్యతను అందరు తెలుసుకునేలా ఉద్యోగులు వివరించారు.

ప్రచార కార్యక్రమాలపై నిషేధం



కామారెడ్డి క్రైం: ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం నవంబర్ 28 మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వచ్చిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికలు ముగిసే వరకు డ్రై డేగా ప్రకటించినందున జిల్లాలో మద్యం షాపులను మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ దృష్ట్యా జిల్లాయేతర వ్యక్తులెవరూ జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జీలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి దశ మారుతుంది

- బీఆర్‌ఎస్ గెలిస్తే పారిశ్రామికవేత్తలు క్యూ కడతారు
- ఐటీ హబ్, విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తాం
- రోడ్‌షోలో మంత్రి కేటీఆర్
- కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు



మాట్లాడుతున్న కేటీఆర్



కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్‌షోలో పాల్గొన్న జనం

సాక్షి, కామారెడ్డి: ''కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి. ఆయన గెలుపుతో కామారెడ్డి దశ, దిశ మారిపోతాయి. ఇక్కడికి ఐటీ హబ్ వస్తుంది. పరిశ్రమలూ తరలిస్తాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించుకుందాం. విద్యాసంస్థలూ ఏర్పాటు చేసుకుందాం'' అని మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ రోడ్‌షో నిర్వహించారు. వేలాది మంది జనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి అధికారంలోకి రాగానే కామారెడ్డిలో ఐటీ హబ్ ఏర్పాటు చేసి, మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. కేసీఆర్ గెలుపుతో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పారిశ్రామిక వేత్తలు వరుస కడతారని పేర్కొన్నారు. బీజేపీకి, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఒరిగేదేమీ ఉండదని, అదే కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే భారీ ప్రాజెక్టులూ వస్తాయని పేర్కొన్నారు. మతం, కులం పేరుతో రాజకీయాలు చేయడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు గుప్పించారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవనా అన్నట్టు సీఎం మీ ఎమ్మెల్యే అయితే ఇక్కడ ఏది కావాలన్నా క్షణాల్లో జరిగిపోతాయన్నారు. పట్టణంలో ఎక్కువ మెజారిటీ ఇచ్చిన వార్డులకు ఎక్కువ నిధులు ఇస్తామని, మెజారిటీ కోసం పోటీ పడాలని పార్టీ నేతలను కోరారు. సభలో కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ శ్రీధర్, జిల్లా చైర్మన్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ముల తిర్మల్‌రెడ్డి, ముజీబొద్దీన్, నిట్టు వేణుగోపాల్‌రావ్, ఎంజీ వేణుగోపాల్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అర్చన, మామిండ్ల అంజయ్య, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టసుఖాల్లో భాగమవుతా

- కేసీఆర్‌ను నమ్ముకుంటే నిండా మునుగుతరు
- రోడ్‌షోలలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



దోమకొండలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి/దోమకొండ/బీబీపేట: ''సీఎం కేసీఆర్ కామారెడ్డి ప్రజల భూములపై కన్నేసి, ఇక్కడ పోటీకి వచ్చాడు. ఆయన కబంధ హస్తాల్లోకి భూములు పోకుండా కంచె వేసి కాపాడేందుకే ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నా'' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంతో పాటు బీబీపేట, దోమకొండ మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నామినేషన్ వేసిన నాటి నుంచి ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారన్నారు. గెలిపిస్తే ప్రజల కష్టసుఖాల్లో భాగమై సేవ చేస్తానన్నారు. పదేళ్లలో సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను అనేక రకాలుగా మోసం చేశారని ఆరోపించారు. ఓటుకు రూ. 10 వేలు పంచి గెలవాలని ప్రయత్నిస్తున్నారని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. అధికారంలోకి వస్తే బీడీ కార్మికులందరికీ పింఛన్ ఇప్పిస్తామన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి వారిని ఆదుకుంటామన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రమంతటా తిరగాల్సిన పరిస్థితుల్లో అందరినీ కలవలేకపోయానని, ఎన్నికల తర్వాత అందరి దగ్గరకు వస్తానని పేర్కొన్నారు. సభల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు యూసుఫ్ అలీ, ఈరవత్రి అనిల్, నాయకులు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి, ఇందుప్రియ, తీగల తిర్మల్‌రెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, సుతారి రమేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



బీబీపేట రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

- అవినీతి రహిత పాలన అందిస్తాం
- బైక్ ర్యాలీలో బీజేపీ కామారెడ్డి అభ్యర్థి వెంకటరమణారెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న వెంకటరమణారెడ్డి



జిల్లా కేంద్రంలో బీజేపీ రోడ్ షో ర్యాలీ

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి అవకాశం ఇస్తే కామారెడ్డిని అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. అనంతరం వీక్లీ మార్కెట్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి రైతుల భూములను కొల్లగొట్టేందుకు వస్తున్న వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాస్టర్‌ప్లాన్ పేరుతో జరిగిన అన్యాయాన్ని అడ్డుకోవడంలో రైతులు చైతన్యవంతంగా పనిచేశారన్నారు. కామారెడ్డిలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై తాను చేసిన పోరాటాలలో ప్రజలు తనకు అండగా నిలిచారన్నారు. ఇక్కడి రైతుల కోసం నిరంతరం పోరాడతానన్నారు. కామారెడ్డినుంచి పోటీ చేస్తున్న ఇద్దరు సీఎం అభ్యర్థులలో ఎవరు గెలిచినా అందుబాటులో ఉండరని వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తాను కామారెడ్డిలో ప్రజల మధ్యే ఉంటానన్నారు. దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని కామారెడ్డి ప్రజలు నిశ్చయించుకున్నారని, ఎన్ని డబ్బులు పంచినా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా బీజేపీ గెలుపును ఆపలేరని పేర్కొన్నారు. ఓటేసి అసెంబ్లీకి పంపిస్తే ఎమ్మెల్యేగా నీతివంతమైన పాలన అందిస్తానన్నారు. ఓటమి భయంతో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆదరించండి

- బాన్సువాడ కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి



బాన్సువాడలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

బాన్సువాడ : వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల బాల్‌రాజ్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, కొత్తకొండ భాస్కర్, మాసాని శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తా

- బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ



బీర్కూర్‌లో ప్రచారం చేస్తున్న యెండల

బాన్సువాడ: ప్రజలు తనను గెలిపిస్తే నిస్వార్థంగా సేవ చేస్తానని బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలో ఆయన ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని, ప్రజలు తనను గెలిపిస్తే నిరంతరం ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని బీజేపీ ప్రకటించిందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, అవినీతి పాలనపై విచారణ జరిపిస్తామని అన్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని ప్రధాన మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు.

బాన్సువాడ అభివృద్ధి సీనన్నతోనే సాధ్యం

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



బాన్సువాడలో ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడ మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకి ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపార దుకాణాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రతి వ్యాపారస్తుడి వద్దకు వెళ్లి కలిసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో రూ.650 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత పోచారంకే దక్కిందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, జంగం గంగాధర్, ఎజాస్, శ్రీధర్, మోహన్ నాయక్, పాత బాలకృష్ణ, తాటి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఒకటిన సీనియర్ ఉమెన్ కబడ్డీ జట్టు ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని లయోలా హైస్కూల్‌లో శుక్రవారం సీనియర్ ఉమెన్ కబడ్డీ జట్టును (75 కిలోల విభాగం) ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 93985 71110, 94408 46682 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'ఆదర్శ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతా'



మాట్లాడుతున్న లక్ష్మీకాంతరావు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): చేతి గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే జుక్కల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతానని కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మంగళవారం అంజని, శివాపూర్, తలాబ్ తండా, చావునితండా, పోచారం, పోచారం తండా, విఠల్‌వాడి, విఠల్ వాడి తండా, లింగంపల్లి, బబుల్‌గావ్, చిన్నతక్కడ్‌పల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ..కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట ఇస్తే తప్పడు.. ఈ సీనన్న



బాన్సువాడలో మాట్లాడుతున్న పోచారం



రుద్రూర్‌లో..

- నేను లోకల్.. ప్రత్యర్థులు నాన్‌లోకల్
- మరోమారు ఆశీర్వదించండి
- బాన్సువాడ రోడ్ షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మాట ఇస్తే తప్పడు.. ఈ సీనన్న అని, నేను లోకల్.. ప్రత్యర్థులు నాన్ లోకల్ ఎవరు కావాలో ప్రజలు ఆలోచించి ఓటేయాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలో ప్రధాన వీధుల గుండా మంగళవారం రోడ్ షో నిర్వహించారు. బాన్సువాడను రూ.650 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రూ.40 కోట్లతో రహదారి విస్తరణ, రూ.100 కోట్లతో ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పట్టణానికి 2400 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తాడ్కోల్ శివారులో వెయ్యి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలో ఉన్న ప్రతి పేద వాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే తన లక్ష్యమని అన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎల్లారెడ్డిలో ప్రజలకు మంచి చేయని వ్యక్తి నేడు బాన్సువాడలో ఓట్లడుగుతున్నాడని, అలాంటి వ్యక్తులను ప్రజలు నమొద్దని సూచించారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, గురువినయ్, శ్రీధర్, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి..

రుద్రూర్: గ్రామాల్లో జరిగిన అభివృద్ధి చూసి తనకు ఓటు వేయాలని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కొందాపూర్, రుద్రూర్ మండల కేంద్రాల్లో రోడ్ షో, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎంపీపీ సుజాత నాగేందర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, బాల్‌రాజ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట్ల గంగారాం, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, విండో చైర్మన్ సంజీవరెడ్డి, జడ్పీటీసీ నరోజి గంగారాం, సర్పంచ్ కొర్వ భాగ్య భూషణ్, ఎంపీటీసీ లక్ష్మి, కొందాపూర్ రాజయ్య, రాములు పాల్గొన్నారు.

వైన్‌షాపుల్లో నోస్టాక్

- మద్యం దుకాణాల వద్ద సందడి
- రెండురోజుల బంద్ నేపథ్యంలో..
- జిల్లాలో 102 వైన్స్‌లు, 20 బార్లు
- 28 సాయంత్రం నుంచి 30 వరకు క్లోజ్



వైన్స్ షాపునకు సీల్ వేస్తున్న సిబ్బంది

ఖలీల్‌వాడి : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వైన్స్ షాపుల వద్ద మద్యం ప్రియులు బారులు తీరారు. పోలింగ్, కౌంటింగ్ ఉన్న దృష్ట్యా రెండురోజుల పాటు మద్యంషాపులు మూసివేస్తారనే సమాచారంతో మద్యంప్రియులు వైన్‌షాపుల ఎదుట క్యూకట్టారు. దీంతో మంగళవారం మధ్యాహ్నానికే మద్యం షాపులు ఖాళీ అయ్యాయి. దీంతో బార్‌వైపు మద్యం ప్రియులు పరుగులు తీశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు వైన్స్‌లను ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి సీల్ వేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఈనెల 30 వరకు వైన్స్‌షాపులు మూసి ఉంచుతారని ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వ చేసి ఉంచితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. 30న ఎన్నికలు పూర్తయ్యాక కలెక్టర్ అనుమతిస్తే రెండు గంటలపాటు వైన్స్‌లను తెరిచే అవకాశాలు ఉంటాయని ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి తెలిపారు.

ఈనెల 30న ముగియనున్న గడువు

జిల్లాలో 102 వైన్స్‌లు ఉండగా వీటి లైసెన్స్ గడువు నవంబర్ 30న ముగియనుంది. వీటికి ఆగస్టులో లక్కీ డ్రాలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు దృష్ట్యా వైన్స్‌లలో స్టాక్ మొత్తం ఖాళీ అయింది. నవంబర్ 30న వైన్స్‌లు గడువు ముగియడంతో డిసెంబర్ 1న కొత్త వైన్స్‌లకు అనుమతి వస్తుంది. కాని డిసెంబర్ 4 తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో లక్కీడ్రాలో కొత్త వైన్స్‌లు దక్కించుకున్న వారు వేచిచూడాల్సి ఉంటుంది.

క్రైం కార్నర్

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని ఒకరి మృతి



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. చంద్రాయన్‌పల్లికి చెందిన రాజమల్లు తన భార్యతో కలిసి బైక్‌పై పొలం వద్దకు వెళ్తుండగా రహదారిపై ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజమల్లుని స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి అన్న కొడుకు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగినమైకంలో ఒకరి హత్య



బస్వంత్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్: తాగిన మైకంలో స్నేహితుల మధ్య ఏర్పడిన వైరం ఒకరిని హత్యకు గురి చేసేలా చేసింది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మెట్టుమీది బస్వంత్(35), కారడి సాయిలుకు స్థానిక వైన్‌షాప్ వద్ద వీరి స్నేహం ఏర్పడింది. వీరు తరచూ మద్యం తాగేవారు. సాయిలు బస్వంత్‌ను మూడు రోజుల క్రితం తన ఇంటికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. వీరి మధ్య చోటు చేసుకున్న గొడవ బస్వంత్‌ను హత్యకు గురిచేసేలా చేసింది. సాయిలు ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు పరిశీలించగా బస్వంత్ మృతదేహం బాత్‌రూం సంపులో గుర్తించారు. ఘటన స్థలిలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి నానమ్మ పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ శాఖ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు మాట్లాడుతూ..పట్టణ కేంద్రంలో కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కారును నడుపుతున్న ఓంకార్‌పై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో అధికారులు రవీందర్, ఫయాజ్, దత్తాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపులో వాహనాలను తనిఖీ చేస్తుండగా 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. మద్యం తీసుకెళ్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోతంగల్ మండలం శేషాద్రి ఫారంలో 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.